వన్యప్రాణుల్లో 'జోంబీ డీర్' వ్యాధి

మనుషులకూ వ్యాపించే చాన్స్



హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): క్రిమికీటకాలు, పక్షులు, జంతువుల నుంచి మనుషులకు వ్యాపించే వ్యాధుల్లో మరొకటి చేరింది. దీనిని 'జోంబీ డీర్' వ్యాధిగా శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. దీనిని 'క్రానిక్ వేస్టింగ్ డిసీజ్' లేదా 'ప్రియాన్' వ్యాధి అని పిలుస్తున్నారు. జింకలు, దుప్పుల జాతులకు సోకే వ్యాధిని అమెరికాలోని ఎల్లోస్టోన్ నేషనల్ పార్క్‌లో గుర్తించారు. జంతువుల్లో ఈ వ్యాధి లక్షణాలు బయటపడటానికి దాదాపు ఏడాది పడుతుందని పేర్కొన్నారు. ఈ వ్యాధి సోకిన జంతువులో జంతువు సమతుల్యత కోల్పోవడం, అధిక మూత్రవిసర్జన, బరువు తగ్గడం, అస్థిరత, నరాల సంబంధిత సమస్యలు ఉంటాయని తెలిపారు. ఇది మనుషులకు కూడా వ్యాపించే అవకాశం ఉన్నదని, దీని వల్ల చిత్త వైకల్యం, నడవడం– మాట్లాడటంలో ఇబ్బంది, అలసట వంటి లక్షణాలు ఉంటాయని తెలిపారు. అమెరికాలో ఈ సంక్రమణ అత్యంత వేగంగా పెరుగుతున్నట్టు గుర్తించారు.

నిఘా నీడలో గోదాములు

- ఇప్పటికే 50 గోదాముల్లో సీసీ కెమెరాల ఏర్పాటు
- దశలవారీగా మిగిలిన చోట్ల ఏర్పాటుకు ప్రణాళికలు
- నిర్వహణలో దేశంలోనే నంబర్-1గా నిలిచిన తెలంగాణ
- కేంద్ర ప్రభుత్వ ప్రశంసలు
- రూ. 6 కోట్ల సబ్సిడీ మంజూరు
- రాష్ట్రంలో 35 లక్షల టన్నుల సామర్థ్యంగల గోదాములు నిర్మించిన కేసీఆర్ ప్రభుత్వం

రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ప్రధాన కార్యాలయంలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న అధికారులు (ఫైల్)

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ప్రతి గోదామును నిఘా నీడ పరిధిలోకి తీసుకొచ్చేందుకు రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ ప్రయత్నిస్తున్నది. ప్రతి గోదాములో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకొంటున్నది. రాష్ట్రంలో ఎఫ్‌సీఐ, కేంద్ర గిడ్డంగుల సంస్థ గోదాములు కాకుండా మొత్తం 1,407 గోదాములు ఉన్నాయి. వీటిలో 260 గోదాములను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ నిర్వహిస్తున్నది. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహంతో ఇప్పటికే 50 సొంత గోదాముల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసింది. ఒక్కో గోదాముకు 6 నుంచి 10 సీసీ కెమెరాలను అమర్చింది. మొత్తం రూ.64 లక్షల ఖర్చుతో 368 కెమెరాలను సమకూర్చింది. సీసీ కెమెరాలతో గోదాములను పరిశీలించేందుకు హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో సెంట్రలైజ్డ్ మానిటరింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసింది. తద్వారా ఆయా గోదాముల్లోని పనితీరును ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నది. ముఖ్యంగా వే బ్రిడ్జి, ల్యాబ్ రూంలలో సీసీ కెమెరాలను కచ్చితంగా ఏర్పాటు చేసింది. మిగిలినవాటిలో గోదాముల వారీగా సీసీ కెమెరాల ఏర్పాటుకు సంస్థ అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు. గోదాముల్లో నిల్వచేసే బియ్యం, మక్కలు, ఇతర పంట ఉత్పత్తులను రక్షించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టింది.

మన గోదాములకు కేంద్రం ప్రశంసలు

గోదాముల నిర్వహణలో తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ పనితీరుపై కేంద్ర ప్రభుత్వం ప్రశంసలు కురిపించింది. గోదాముల నిర్మాణ విధానం, నిర్వహణ అద్భుతంగా ఉన్నదని కితాబిచ్చింది. దేశంలో మరే రాష్ట్రానికి ఇవ్వని విధంగా రాష్ట్రంలో కొత్తగా నిర్మించిన గోదాముల ఖర్చులో కొంత మొత్తాన్ని సబ్సిడీ కింద విడుదల చేసింది. ఈ విధంగా 8 గోదాములకు రూ.6 కోట్ల సబ్సిడీ అందజేసింది. మరో పది గోదాములకు సబ్సిడీ ఇవ్వాలన్న ప్రతిపాదనలు ఉన్నాయి.

గోదాముల సామర్థ్యం రెట్టింపు

రాష్ట్ర ఏర్పాటు తర్వాత గోదాముల సామర్థ్యం పెంపుపై కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. సాగు విస్తీర్ణం, పంట ఉత్పత్తులు పెరుగుతుండటంతో నిల్వకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టింది. 2014-15లో 39 లక్షల టన్నులుగా ఉన్న గోదాముల నిల్వ సామర్థ్యాన్ని 74 లక్షల టన్నులకు పెంచింది. 35 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యాన్ని కొత్తగా కల్పించింది. దీనికితోడు మరో 40 లక్షల టన్నుల సామర్థ్యం పెంపునకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో డీపీఆర్‌ను సిద్ధం చేసింది.

> **నిర్వహణలో పారదర్శకత పెంచేందుకే..**
>
>
>
> గోదాముల నిర్వహణలో పారదర్శకత పెంచేందుకు ప్రతి గోదాములో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రస్తుతం ఎస్‌డబ్ల్యూసీ పరిధిలోని 50 గోదాముల్లో ఏర్పాటు చేశాం. మిగిలిన వాటిలో దశలవారీగా ఏర్పాటు చేస్తాం. గోదాముల నిర్వహణను పెంచి బియ్యం, ఇతర పంట ఉత్పత్తుల రక్షణకు ప్రథమ ప్రాధాన్యం ఇచ్చేందుకే ఈ చర్యలు. సీసీ కెమెరాల ఏర్పాటుతో చాలా సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.
>
> **- జితేందర్‌రెడ్డి, ఎండీ, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్**

టెలిగ్రామ్‌లో సినిమా చూస్తున్నారా?

- జాగ్రత్త.. అవన్నీ సైబర్ లింకులే!
- ప్రజలకు సైబర్ దోస్త్ హెచ్చరిక

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): కొత్తగా రిలీజ్ అయిన సినిమా, వెబ్ సిరీస్ చూడాలంటే వెంటనే టెలిగ్రామ్‌ను ఆశ్రయిస్తున్నవారికి కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో పని చేస్తున్న సైబర్ దోస్త్ హెచ్చరికలు జారీ చేసింది. చాలా సినిమాలు ఓటీటీలో రిలీజ్ అవగానే సబ్‌స్క్రిప్షన్ లేకపోయినా వెంటనే టెలిగ్రామ్‌లోని పలు గ్రూపుల్లో ప్రత్యక్షమవుతున్నాయి. దీంతో చాలా మంది ఈ ఫ్రీడ్ గ్రూపుల గురించి తెలియక.. కొత్త సినిమాల మోజులో టెలిగ్రామ్ గ్రూపుల్లో చేరుతున్నారు. దీంతో ఐబొమ్మ, టెలిగ్రామ్ వంటి వాటిల్లో కొత్త సినిమాలకు థంబ్‌నైల్స్ పెట్టి.. సైబర్ లింకులను అటాచ్ చేస్తున్నారు. ఆ లింక్స్ ఓపెన్ చేయగానే సైబర్ నేరగాళ్లకు మన సమాచారం వెళ్తుంది. దీంతో వారు సులువుగా ట్రాప్ చేసి, డబ్బులు వసూలు చేస్తున్నట్టు సైబర్ దోస్త్ గుర్తించింది. ఈ తరహా మోసాలు టెలిగ్రామ్ యాప్‌లో భారీగా జరుగుతున్నట్టు తెలిపింది. తెలియని లింక్‌లను ఓపెన్ చేసి, డబ్బులు పోగొట్టుకోవద్దని సూచిస్తున్నది. టెలిగ్రామ్ ద్వారా ఇచ్చే లింక్‌ల నుంచి ఎలాంటి యాప్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవద్దని పేర్కొంటున్నది.

జావేద్‌ను అభినందిస్తున్న హైదరాబాద్ గ్రూప్ కమాండర్ కల్నల్ అనిల్

'యూత్ ఎక్స్చేంజ్'కు ఎన్‌సీసీ ఆఫీసర్

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): భూటాన్‌లో ఇటీవల నిర్వహించిన 'యూత్ ఎక్స్చేంజ్' ప్రోగ్రామ్‌కు ఏపీ, తెలంగాణ ఎన్‌సీసీ నుంచి సీనియర్ అండర్ ఆఫీసర్ (ఎస్‌యూవో) మొహమ్మద్ జావేద్ హాజరయ్యారు. ఈ యూత్ ఎక్స్చేంజ్‌కు దేశవ్యాప్తంగా 12 మంది ఎంపిక కాగా, మన రీజియన్ నుంచి వెళ్లిన ఏకైక ఆఫీసర్ జావేద్. అక్కడ శిక్షణ, సాంస్కృతిక కార్యక్రమాల కార్యాచరణ, విభిన్న కార్యక్రమాల్లో ఎన్‌సీసీ ప్రాధాన్యం వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించినట్టు జావేద్ తెలిపారు. ఈనెల 12 నుంచి 18 వరకు భూటాన్‌లో నిర్వహించిన పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జావేద్‌ను హైదరాబాద్ గ్రూప్ కమాండర్ కల్నల్ అనిల్ సత్కరించారు.

హైదరాబాద్‌లో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్

- వచ్చే ఫిబ్రవరిలో నిర్వహణ?
- జేఎన్టీయూ ఆతిథ్యం
- రాష్ట్రం అనుమతే తరువాయి
- ఇప్పటివరకు 6 సార్లు నగరంలో నిర్వహణ

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): ప్రతిష్ఠాత్మక 109వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌కు హైదరాబాద్ నగరం వేదిక కానున్నది. 2024లో నిర్వహించే ఈ సైన్స్ కాంగ్రెస్‌కు నగరంలోని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్టీయూ) అతిథ్యం ఇవ్వనున్నది. తాజా సమాచారం ప్రకారం వచ్చే ఫిబ్రవరి మూడు, నాలుగువారాల్లో ఈ సైన్స్ కాంగ్రెస్‌ను నిర్వహించే అవకాశాలు ఉన్నాయి. ఈ మేరకు ఐఎస్సీ ప్రెసిడెంట్ డాక్టర్ అర్వింద్ సక్సేనా, మాజీ జనరల్ ప్రెసిడెంట్ డాక్టర్ అశోక్ సక్సేనా, డాక్టర్ విజయలక్ష్మి సక్సేనా, ప్రొఫెసర్ రంజిత్ వర్మ, ప్రొఫెసర్ నారాయణరావుతో కూడిన నిపుణుల కమిటీ ఈ నెల 23న జేఎన్టీయూను సందర్శించి, నిర్వహణకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు అనుమతి కోసం త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించాలని జేఎన్టీయూ అధికారులు నిర్ణయించారు. ఈ సదస్సుకు ప్రధాని మోదీ సహా పలువురు నోబుల్ బహుమతి గ్రహీతలు హాజరయ్యే అవకాశం ఉన్నది. సుమారు 7 వేల మందికిపైగా జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులు హాజరవుతారు. ఈ సైన్స్ కాంగ్రెస్‌లో 14 సెషన్లు జరుగుతాయి. దీని నిర్వహణకు ముగ్గురు కాన్ఫరెన్స్ సెక్రటరీలను నియమిస్తారు. సుమారు రూ.8 నుంచి రూ.10 కోట్లు ఖర్చు కానున్నట్టు జేఎన్టీయూ వర్గాలు అంచనా వేస్తున్నా. ఇప్పటివరకు హైదరాబాద్‌లో ఐఎస్సీని ఆరుసార్లు నిర్వహించగా, వచ్చే ఏడాది జరగబోయేది ఏడో సదస్సు కానున్నది.

అనుమతి కోసం లేఖ

ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ నిర్వహణకు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని జేఎన్టీయూ కోరింది. ఈ మేరకు జేఎన్టీయూ వీసీ కట్టా నర్సింహారెడ్డి గురువారం సీఎంవోకు, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్టీ) సెక్రటరీకి వేర్వేరుగా లేఖలు రాశారు. సైన్స్ కాంగ్రెస్ నిర్వహణకు రూ.10 కోట్ల అవసరమవుతాయని, ఆయా నిధులను మంజూరు చేయాలని సీఎంవోకు రాసిన లేఖలో వీసీ ప్రస్తావించారు. ఇదిలావుండగా సైన్స్ కాంగ్రెస్ నిర్వహణకు ఏర్పాట్లు చేసే పనిలో జేఎన్టీయూ అధికారులు నిమగ్నమయ్యారు.

వ్యూహం సినిమా విడుదలకు హైకోర్టు బ్రేక్

హైదరాబాద్, డిసెంబర్ 28, (నమస్తే తెలంగాణ): రాంగోపాల్‌వర్మ దర్శకత్వంలో రూపొందిన వ్యూహం సినిమా విడుదలకు సెన్సార్ బోర్డు జారీచేసిన సర్టిఫికెట్ హైకోర్టు సస్పెండ్ చేసింది. జనవరి 11 వరకు సెన్సార్ బోర్డు జారీచేసిన సర్టిఫికెట్‌ను సస్పెన్షన్‌లో ఉంచుతున్నట్టు జస్టిస్ సూరేపల్లి నందా గురువారం ఉత్తర్వులు జారీచేశారు. టీడీపీ జెండాలు, నేతల పేర్లతో సినిమా తీశారని, తమ పరువుకు భంగం కలిగించేలా చిత్రీకరించారని ఆరోపిస్తూ తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పిటిషన్ దాఖలుచేశారు. అన్ని అంశాలను పరిశీలించిన తరువాతనే సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ ఇచ్చిందని నిర్మాత, దర్శకులు వాదించారు. వాదనలు విన్న న్యాయమూర్తి సెన్సార్ బోర్డు సర్టిఫికెట్‌ను సస్పెన్షన్‌లో ఉంచుతున్నామని తెలుపుతూ తదుపరి విచారణను జనవరి 11వ తేదీకి వాయిదా వేశారు.

ఆర్జీవీపై బర్రెలక్క ఫిర్యాదు

మహిళా కమిషన్‌లో కేసు నమోదు

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): దర్శకుడు రామ్‌గోపాల్ వర్మపై బర్రెలక్క అలియాస్ కర్నె శిరీష గురువారం మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా శిరీష తరపు న్యాయవాది మాట్లాడుతూ ఆర్జీవీ 'వ్యూహం' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ సందర్భంగా 'ఊరు.. పేరు లేని ఆవిడ.. బర్రెలక్కగా చాలా ఫేమస్ అయిపోయింది'.. అని అవమానించారని చెప్పారు. తమ ప్రాంత బిడ్డలను కించపరిచేలా మాట్లాడటం తప్పు అని, రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తే తరిమి కొడతామని హెచ్చరించారు. ఈ విషయంపై న్యాయపోరాటం చేస్తామని న్యాయవాది స్పష్టం చేశారు.

న్యూ ఇయర్ వేడుకలపై డేగకన్ను

- పబ్బులు, బార్లు, రెస్టారెంట్లపై పటిష్ఠ నిఘా
- రాష్ట్రవ్యాప్తంగా 50 మఫ్టీ బృందాలు
- 'గ్రేటర్' పరిధిలోనే 20 ప్రత్యేక టీమ్‌లు

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): నూతన సంవత్సర వేడుకల్లో డ్రగ్స్, గంజాయి వాడకాన్ని పూర్తిగా నియంత్రించడంతో పాటు పబ్బులు, బార్లలోకి మైనర్లు రాకుండా అడ్డుకునేందుకు ఎక్సైజ్ శాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకున్నది. ఇందులో భాగంగా గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగా నిఘా బృందాలను మోహరించింది. మొత్తం 50కిపైగా బృందాలను మఫ్టీల్లో విధుల్లోకి దింపామని, వీరంతా జిల్లా కేంద్రాల్లోని బార్లు, రెస్టారెంట్లతో పాటు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పబ్బుల్లో విధులు నిర్వర్తిస్తారని ఎక్సైజ్ ఉన్నతాధికారులు బుధవారం వెల్లడించారు. నూతన సంవత్సర వేడుకల్లో ఎక్కడైనా డ్రగ్స్ వాడినా, అశ్లీల నృత్యాలు చేసినా, బార్లు, పబ్బుల్లోకి మైనర్లను అనుమతించినా వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఒక్క జీహెచ్ఎంసీ పరిధిలో 20 బృందాలను రంగంలోకి దింపడంతోపాటు అక్రమ మద్యం నియంత్రణ కోసం రైళ్లలో తనిఖీలు చేపట్టేందుకు 13 బృందాలను మోహరించామని, రాష్ట్రవ్యాప్తంగా ఎక్సైజ్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడంతో పాటు విమానాశ్రయంలోనూ పటిష్ఠ నిఘా పెట్టామని వివరించారు. కేవలం తనిఖీలకు కేటాయించిన బృందాలే కాకుండా రెగ్యులర్‌గా విధులు నిర్వర్తించే ఎక్సైజ్ అధికారులు 3 షిఫ్టుల్లో 24 గంటలూ విధుల్లో ఉండేలా ప్రణాళికలు రూపొందించినట్టు తెలిపారు.

హెచ్‌పీఎస్ పూర్వవిద్యార్థులు కూ ఆఫ్ ప్రోక్టర్ అండ్ గ్యాంబుల్ శైలేశ్ జెజురీకర్, అడోబ్ సీఈవో శంతను నారాయణ్‌కు 'గ్లోబల్ ఇంపాక్ట్' అవార్డులను అందజేస్తున్న యాజమాన్యం

హెచ్‌పీఎస్ శతాబ్ది వేడుకల ముగింపు

పూర్వవిద్యార్థులకు ఇంపాక్ట్ అవార్డులు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ శతాబ్ది వేడుకలు అట్టహాసంగా ముగిశాయి. బుధవారం రాత్రి స్కూల్ ఆవరణలో 'ఏ నైట్ ఆఫ్ ఆనర్స్' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పూర్వవిద్యార్థులు అడోబ్ సీఈవో శంతను నారాయణ్, కూ ఆఫ్ ప్రోక్టర్ అండ్ గ్యాంబుల్ శైలేశ్ జెజురీకర్, ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డిలను 'గ్లోబల్ ఇంపాక్ట్' అవార్డులతో పాఠశాల యాజమాన్యం గౌరవించింది. హెచ్‌పీఎస్ సొసైటీ ప్రెసిడెంట్ గుస్తీ నోరియా, కార్యదర్శి-కోశాధికారి జలగం వెంకట్‌రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ స్కంద్ బాలి ఆధ్వర్యంలో పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన పూర్వపు అధ్యక్షులతోపాటు ప్రతినిధుల త్యాగాలను కీర్తించారు.

ఫిబ్రవరి 28 నుంచి ఇంటర్ ఎగ్జామ్స్

> మొదటిపేజీ తరువాయి...

మార్చి 19న ముగియనున్నాయి. అయితే, ప్రధాన పరీక్షలు రెండు రోజుల ముందుగానే పూర్తవుతాయి. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కాస్త ముందుగానే ఇంటర్ వార్షిక పరీక్షలను నిర్వహించేలా ఇంటర్‌బోర్డు పరీక్షల షెడ్యూల్‌ను రూపొందించి విడుదల చేసింది. ఒక రోజు ఫస్టియర్ వారికి, మరో రోజు సెకండియర్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలుంటాయి. నిమిషం ఆలస్యమైనా పరీక్షలు రాసేందుకు విద్యార్థులను అనుమతించరు.

ఫిబ్రవరి 1 నుంచి ప్రాక్టికల్స్

ఇంటర్ ప్రాక్టికల్స్‌ను 2024 ఫిబ్రవరి 1 నుంచి 15 వరకు నిర్వహిస్తారు. జనరల్, వొకేషనల్ కోర్సులో విద్యార్థులకు రెండో శనివారం, ఆదివారం ప్రాక్టికల్స్ జరుగుతాయి. ప్రాక్టికల్స్‌ను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లలో నిర్వహిస్తారు. ఇక ఈ ఏడాది తొలిసారిగా ఫస్టియర్ విద్యార్థులకు ఇంగ్లిష్ ప్రాక్టికల్స్‌ను కూడా నిర్వహించనున్నారు. ఈ ప్రాక్టికల్స్‌ను ఫిబ్రవరి 16న నిర్వహిస్తారు.

ఎథిక్స్ హ్యూమన్‌వ్యాల్యూస్

వచ్చే ఫిబ్రవరి 17న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్ ఎగ్జామినేషన్, ఫిబ్రవరి 19న ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షలను నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు కొనసాగుతాయి. ఈ రెండు పరీక్షలు ఇంటర్నల్స్ కాగా, వీటిని విద్యార్థులు చదువుతున్న సంబంధిత కాలేజీల్లోనే నిర్వహిస్తారు. ఈ రెండు పరీక్షలకు హాజరవడం తప్పనిసరి. లేదంటే ఫెయిలైనట్టుగానే పరిగణిస్తారు.

ఫస్టియర్ పరీక్షల షెడ్యూల్

తేదీ (రోజు)	పరీక్షాపేపర్
28-02-2024 (బుధవారం)	సెకండ్ లాంగ్వేజ్ పేపర్ -1
01-03-2024 (శుక్రవారం)	ఇంగ్లిష్ పేపర్ -1
04-03-2024 (సోమవారం)	గణితం పేపర్ - 1ఏ, బాటనీ పేపర్ -1, పొలిటికల్ సైన్స్ పేపర్ -1
06-03-2024 (బుధవారం)	గణితం పేపర్ - 1బీ, జువాలజీ పేపర్ -1, హిస్టరీ పేపర్ -1
11-03-2024 (సోమవారం)	ఫిజిక్స్ పేపర్ -1, ఎకనామిక్స్ పేపర్ -1
13-03-2024 (బుధవారం)	కెమిస్ట్రీ పేపర్ -1, కామర్స్ పేపర్ -1
15-03-2024 (శుక్రవారం)	పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్ -1, బ్రిడ్జికోర్సు గణితం పేపర్ -1 (బైపీసీ విద్యార్థులకు)
18-03-2024 (సోమవారం)	మోడర్న్ లాంగ్వేజ్ పేపర్ -1, జాగ్రఫీ పేపర్ -1

సెకండియర్ పరీక్షల షెడ్యూల్

తేదీ (రోజు)	పరీక్షాపేపర్
29-02-2024 (గురువారం)	సెకండ్ లాంగ్వేజ్ పేపర్ -2
02-03-2024 (శనివారం)	ఇంగ్లిష్ పేపర్ -2
05-03-2024 (మంగళవారం)	గణితం పేపర్ -2ఏ, బాటనీ పేపర్ -2, పొలిటికల్ సైన్స్ పేపర్ -2
07-03-2024 (గురువారం)	గణితం పేపర్ -2బీ, జువాలజీ పేపర్ -2, హిస్టరీ పేపర్ -2
12-03-2024 (మంగళవారం)	ఫిజిక్స్ పేపర్ -2, ఎకనామిక్స్ పేపర్ -2
14-03- 2024 (గురువారం)	కెమిస్ట్రీ పేపర్ -2, కామర్స్ పేపర్ -2
16-03-2024 (శనివారం)	పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్ -2, బ్రిడ్జికోర్సు గణితం పేపర్ -2 (బైపీసీ విద్యార్థులకు)
19-03-2024 (మంగళవారం)	మోడర్న్ లాంగ్వేజ్ పేపర్ -2, జాగ్రఫీ పేపర్ -2

'ఫూలే ఓవర్సీస్' సర్టిఫికెట్ వెరిఫికేషన్ కొనసాగింపు

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): మహాత్మా జ్యోతిబా ఫూలే ఓవర్సీస్ పథకానికి దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ యథావిధిగా కొనసాగుతున్నది. జ్యోతిబా ఫూలే బీసీ విదేశీవిద్యానిధి పథకం కింద ఆర్థిక సాయం కోసం మొత్తం 2,665 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకొన్నారు. వీరిలో 2,023 మంది బీసీ కులాలకు చెందినవారు కాగా, 642 మంది ఈబీసీ కులాలకు చెందిన అభ్యర్థులున్నారు. రోజుకు 100 మంది చొప్పున ఈ నెల 15 నుంచి అభ్యర్థుల సర్టిఫికెట్ల పరీశీలన ప్రారంభించారు. జనవరి 23 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ కొనసాగనున్నదని తెలిపారు.

అధ్యాపకుల సమస్యలు పరిష్కరించండి : టిగ్లా

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ) : ఇంటర్ విద్యలో పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఇంటర్మీడియట్ గవర్నమెంట్ లెక్చరర్స్ అసోసియేషన్ (టిగ్లా) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు టిగ్లా రాష్ట్ర అధ్యక్షుడు మైలారం జంగయ్య, ప్రధాన కార్యదర్శి మాచర్ల రామకృష్ణగౌడ్ గురువారం సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంను, ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజాలను వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. అలాగే జనరల్, వొకేషనల్ లెక్చరర్లను క్రమబద్ధీకరించాలని తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ జేఏసీ చైర్మన్ కనకచంద్రం, నాయకులు కడారి శ్రీనివాస్ సచివాలయంలో విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశంను, ఇంటర్ విద్య డైరెక్టర్ శృతి ఓజాను కలిసి విజ్ఞప్తి చేశారు.

రేపటి నుంచి స్టాఫ్‌నర్స్ సర్టిఫికెట్ వెరిఫికేషన్

జనవరి 6 వరకు ప్రక్రియ

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): స్టాఫ్‌నర్స్ ఉద్యోగాల నియామకానికి ఈ నెల 30 నుంచి వచ్చే నెల 6 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించనున్నట్టు మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎంహెచ్ఎస్ఆర్బీ) తెలిపింది. హైదరాబాద్ బండ్లగూడలోని ఎక్సైజ్ అకాడమీ ప్రాంగణంలో ఈ వెరిఫికేషన్ కొనసాగనున్నదని వెల్లడించింది. ఇందుకు తగిన ఏర్పాట్లు చేసినట్టు పేర్కొన్నది. 1:1.25 పద్ధతిలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేస్తామని స్పష్టంచేసింది. ఈ మేరకు ప్రొవిజినల్ లిస్టును విడుదల చేశామని, అభ్యర్థులకు సమాచారం కూడా ఇచ్చామని తెలిపింది. అభ్యర్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు రాకపోయినా, కావాల్సిన పత్రాల్లో ఏవైనా సమర్పించకపోయినా వారి అభ్యర్థిత్వాన్ని రద్దు చేస్తామని స్పష్టంచేసింది. రాష్ట్రవ్యాప్తంగా 5,204 స్టాఫ్‌నర్స్ పోస్టులకు ప్రభుత్వం గతేడాది డిసెంబర్ 30న నోటిఫికేషన్ జారీ చేసింది. వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు మరో 1,890 పోస్టులను ప్రభుత్వం జత చేసింది. దీంతో మొత్తం పోస్టులు 7,094కు పెరిగాయి. ఈ నెల 18న ఫలితాలు విడుదల చేసింది.

కరోనా కేసులపై సర్కారు దాపరికం

- రెండ్రోజులకోసారి బులెటిన్ విడుదలకు నిర్ణయం!

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): పెరుగుతున్న కరోనా జేఎన్.1 వేరియంట్‌తో యావత్తు దేశం అప్రమత్తమై, ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న సమయంలో తెలంగాణ ప్రభుత్వం మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నది. మొన్నటి వరకు కరోనా కేసుల వివరాలతో కూడిన రోజువారీ బులిటిన్‌ను విడుదల చేసిన వైద్యారోగ్యశాఖ రెండు రోజులుగా బులిటిన్‌ను నిలిపివేసింది. రాష్ట్రవ్యాప్తంగా రోజూ 10 నుంచి 12 కేసులు నమోదయ్యాయి. అందులో 90 శాతం కేసులు గ్రేటర్ పరిధిలోవే. అనారోగ్యంతో ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌లో చేరిన ఐదుగురు రోగులకు కరోనా పాజిటివ్ నిర్ధారణ కాగా, వారిలో ఇద్దరు మృతిచెందారు. మరుసటి రోజు బులెటిన్‌ను నిలిపివేశారు. పొరుగున ఉన్న మహారాష్ట్రలో గురువారం ఒక్కరోజే 87 కేసులు నమోదై, రెండు మరణాలు సంభవించాయి. ఇలాంటి సమయంలో రాష్ట్రంలో కొవిడ్ కేసులపై దాపరిక ధోరణి సరికాదంటున్నారు వైద్యనిపుణులు.

ఏజెంట్లతో జరభద్రం

- విదేశాల్లో ఉద్యోగం పేరుతో పెరుగుతున్న మోసాలు
- గుర్తింపు లేని ఏజెన్సీలను ఆశ్రయించొద్దు
- హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్ట్ అధికారి స్నేహజ

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నకిలీ ఏజెంట్ల మోసాలు పెరుగుతున్నాయని హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్ట్ అధికారి స్నేహజ తెలిపారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిబంధనలకు విరుద్ధంగా కొందరు సంస్థలను ఏర్పాటు చేసి మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఏజెన్సీల కమ్యూనికేషన్స్ అన్నీ వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా జరుగుతుండటంతో అక్రమార్కులను గుర్తించడం కష్టమవుతున్నదని తెలిపారు. మోసపూరిత హామీలతో అడిగినంత డబ్బు